# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి ! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
**(P.O. Box 80) Seshagiri Rao St.**
**KAKINADA-533 004**

గమనిక :- మీరు **M.O.** పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

**Printed at Razan Electric Press, Kakinada-1.**

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 | మార్చి 1992 | సంచిక 8


## సంపాదకీయము

### అసూయ - ఒక మహా భయంకర పాపము

### ( Envy - A Deadly Sin )

ఎవరయిన ఒకరు అదృష్టాన్ని లేక భాగ్యాన్ని అనుభవిస్తున్నప్పుడు నీవు సంతోషించెదవా ? లేక చేస్తున్న పనిలో ఒకరు నీకంటె ఘనత లేక ఉన్నతి పొందినప్పుడు నీవు ఆనందించెదవా ? నీవు చేసిన పనికి ప్రశంస కలుగక పోయినను ఎదుటి వానికి కలిగిన మెప్పునకు సంతోషించెదవా? ఇటువంటి సందర్భాలలో చాలసార్లు మనం ఆనందం వ్యక్తపరచక పోవడం పరిపాటి. కారణం అసూయ. అసూయ అంటే అవతలి వ్యక్తియొక్క ఉన్నత స్థితిగతుల విషయములో పొందు అసంతృప్తితో కూడిన పగ లాంటిదని నిఘంటువు అర్థము చెప్పుచున్నది.

ఈ అసూయ ప్రపంచమంతట నున్న పెద్ద సమస్య. దీనికి భౌగోళిక పరిధులు లేవు. ఇది యౌవనులు, వృద్ధులు, ధనికులు, పేదలు ఆడ మగ, ఉపాధ్యాయుడు విద్యార్థి అను తేడా లేక అందరి మధ్యను

కనబడుతుంది. ఈ అసూయ నుండి తప్పించుకొనేవారు ఎవ్వరూ లేక పోయినను ఈ పాపము అంత సులువుగా అగపడేది కాదు. ఒక నేరస్తుడు తన ఉనికిని కనబడనీయకుండ దాగుకొనినట్లే అసూయ కూడ చాల పేర్లను ధరించుకొని యుండును. దీని వెనుక అనేక పాపములు పుట్టుకొచ్చును. ఇది సాతాను ప్రయోగించు ఆయుధములలో అతి శక్తివంతమైనది. దీని వలన మానవునికి భువిపై సంతోషము కరవై తద్వారా నిత్యత్వము లేకుండ పోవును.

ఈ అసూయ ప్రపంచంలో మొదటి హత్యకు కారణమైనది. అసూయచేతనే కయీను తన తమ్ముడు హేబేలును హతమార్చెను (ఆది 4:1-8; 1 యోహాను 3:12). అసూయవలన యోసేపు అన్నలు అతనిని బానిసగా అమ్మివేసిరి (ఆది 37 అధ్యా). మోషే అహరోనులకు దేవుడు గౌరవ ప్రదమయిన ప్రముఖ స్థానాన్ని యిచ్చుటచే అసూయపడి కోరహు దాతాను అబీరాములు వారిపై తిరుగబడిరి, తత్ఫలితముగా వారును వారి అనుచరులు రెండువందల యాభై మందిని దేవుడు నాశనము చేసెను (సంఖ్యా 16 అధ్యా). ఈ అసూయే దేవుని కుమారుడు యేసుక్రీస్తుని సిలువ వేయించి ప్రపంచ చరిత్రలో కనీవినీ ఎరుగని గొప్ప భయంకర నేరము చేయించినది. పిలాతు క్రీస్తును విడుదల చేయుటకు ప్రయత్నించెను గాని వారు (యూదా పెద్దలు) అసూయచేత అతనిని అప్పగించిరని ఎరిగియుండెను (మత్తయి 27 : 18).

అసూయ ఒక జబ్బు లాంటిది. నెమ్మది నెమ్మదిగా మన జీవితాలను హరించేస్తుంది. చాలసార్లు దీనిని ఆలశ్యంగా గుర్తించడం జరుగుతుంది. "సాత్వికమైన మనస్సు శరీరమునకు జీవము; మత్సరము ఎముకలకు కుళ్లు" (సామెతలు 14 : 30). "అయితే మీ హృదయములలో సహింపనలవికాని మత్సరమును వివాదమును ఉంచుకొనిన

వారైతే అతిశయపడవద్దు, సత్యమునకు విరోధముగా అబద్ధమాడవద్దు. ఈ జ్ఞానము పైనుండి వచ్చునది కాక భూసంబంధమైనదియు ప్రకృతి సంబంధమైనదియు దయ్యముల జ్ఞానము వంటిదియునై యున్నది. ఏలయనగా మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతి నీచకార్యమును ఉండును (యాకోబు 3 : 14-16).

అసూయతో చేరిన యితర పాపములను గూర్చి విచారణ చేయుదము. పౌలు యిట్లు చెప్పెను: చాలమంది అన్యులు "సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వముచేతను, లోభముచేతను, ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము నరహత్య కలహము కపటము వైరమను వాటితో నిండినవారై యుండిరి" (రోమా 1 : 29). పౌలు మరల ఇట్లు చెప్పుచున్నాడు, "అల్లరితో కూడిన ఆటపాటలైనను మత్తయినను లేకయు, కామ విలాసములైనను పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను మత్సరమైనను లేకయు, పగటియందు నడుచుకొన్నట్టు మర్యాదగా నడుచుకొందము" (రోమా 13 : 13).

ఎదుటి వానికి మంచి అదృష్టము భాగ్యము కలిగివచ్చిన మనము ఎట్లు స్పందించాలి? ఇతరులు ఆశీర్వాదములు పొందునపుడు క్రైస్తవుడు మనస్ఫూర్తిగా సంతోషించుటకు ప్రయత్నించాలి. చాల సార్లు మనం ఎవరయినా ఆపదలో నుండిన లేక రోగముతో బాధపడ్తున్నా మనకు ఏదో బలం వచ్చినట్లు ఆసక్తిగా ఆనందంగా ఆ విషయాలు వింటుంటాము. కాని, ఓహ్! ఒక వ్యక్తి పొగడబడ్తుంటే ఔదార్యంతో నిర్మలంగా సంతోషపడటం ఎంతో కష్టం.

మన తోటివారల యెడల స్వచ్ఛమైన ప్రేమ మంచితనము కలిగి యుండుట ఎంతో అవసరము. ధర్మశాస్త్రములో గొప్పదయిన

రెండవ ఆజ్ఞ నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెనని యేసు క్రీస్తు చెప్పెను (మత్తయి 22 : 37-40). "ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును, ప్రేమ మత్సరపడదు..."(1 కొరింధీ 13:5) అని పౌలు చెప్పెను. కావున ఎదుటివారి ఉన్నతిని, అదృష్టాన్ని చూచి మనం సంతోషపడాలి. వారు పొందు ఆశీర్వాదములకు మనం ఆనందించాలి. అట్లు చేసినచో మనము సంతోషంగా వుంటాము, దేవుడుకూడ సంతృప్తిపడి ఆనందిస్తాడు (I GT).

## తండ్రి చిత్తము

## (Will of the Father)

"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్త 7 : 21). మానవులు రక్షణ పొందుటకు నిత్యజీవమును పొందుటకు తండ్రియైన దేవుని చిత్తమునకు లోబడవలసి యున్నది. ఆయన సంకల్పము ఖచ్చితమైనది మారనిది. దానిని అభివృద్ధి చేయుటకు గాని సూక్ష్మీకరించుటకు గాని మానవుల కధికారమివ్వబడలేదు. మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమై యుండవలెనని ఆయన కోరుచున్నాడు (ఎఫెసీ 1 : 6). ఆయన తన దయా సంకల్పము చొప్పున తన చిత్తమును గూర్చిన మర్మమును మనకు తెలియజేసి యున్నాడు. (ఎఫెసీ 1 : 8).

ఆయన సంకల్పమును మానవుడు ప్రశ్నించకూడదు. ఆయన సృష్టియైన మనము సృష్టికర్తను ప్రశ్నించే అధికారము లేదు. మోషేను దేవుడిట్లు ప్రశ్నించెను: మానవునకు నోరిచ్చువాడు ఎవడు? మూగవానినే గాని చెవిటివానినే గాని దృష్టిగలవానినే గాని గ్రుడ్డి

వానినే గాని పుట్టించిన వాడెవడు? యెహోవానైన నేనే గదా!" (నిర్గ 4 : 11). అంగవైకల్యముగల ఒక మానవుడు నన్నెందుకు దేవా ఈలాగున సృష్టించితివనుటకు అధికారము లేదు.

సిరియా రాజు సైన్యాధిపతియైన నయమాను తనకు గల కుష్ఠు రోగమునుండి స్వస్థత పొందగోరి షోమ్రోనులో నున్న ప్రవక్తయైన ఎలీషా యింటి ద్వారము ముందు నిలిచియుండగా, ఎలీషా నీవు యొర్దాను నదికి పోయి యేడు మారులు స్నానము చేయుము. నీ ఒళ్లు బాగై నీవు శుద్ధుడవగుదువని అతనితో చెప్పుటకు ఒక దూతను పంపెను (II రాజులు 5 : 9-10). అతడు శుద్ధుడగుటకు ప్రవక్త పంపిన వర్తమానము దేవుని చిత్తము. కాని నయమాను తలంచిన విధమేదనగా—"అతడు నా యొద్దకు వచ్చి నిలిచి, తన దేవుడైన యెహోవా నామమును బట్టి తన చెయ్యి రోగముగా ఉన్న స్థలము మీద ఆడించి కుష్ఠురోగము మాన్పునని నేననుకొంటిని" (2 రాజులు 5 : 11). అతడు తలంచిన విధము, అతని మనోభావము దేవుని చిత్తము కాదు. అతడు శుద్ధుడగుటకు యొర్దాను నదిలో యేడు మారులు స్నానము చేయుటయే మార్గము. ఈ మార్గము గాక మరో మార్గముద్వారా నయమాను శుద్ధుడు కాలేదు.

యేసుప్రభువు పుట్టు గ్రుడ్డివానిని స్వస్థపరచిన విధము మనకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చును. "ఆయన యిట్లు చెప్పి నేలమీద ఉమ్మివేసి, ఉమ్మితో బురదచేసి, వాని కన్నులమీద ఆ బురదపూసి నీవు సిలోయము కోనేటికి వెళ్ళి అందులో కడుగుకొనుమని చెప్పెను" (యోహా 9 : 6-7). ప్రభువు అనేకులను స్వస్థపరచిన విధమునకు వేరుగా ఈ సంఘటన కనిపించుచున్నది. ఆయన మాట చెప్పి లేదా ముట్టి స్వస్థపరచ వచ్చును గదా! ఆయన ఎందుకీలాగున చేసెనని మనము ప్రశ్నించలేము అది ఆయన చిత్తము.

ఎవడును నశింపక అందరును మారుమనస్సు పొందవలెనని కోరుచు మన యెడల దీర్ఘశాంతము కలిగియున్న తండ్రి ఉత్తమమును అనుకూలమును సంపూర్ణమైయున్న తన చిత్తమును మనకు బయలుపరచెను. దానికి ఒక ప్రయోజన మున్నది. మానవు లందరు ఒకే సంకల్పముతో విమోచింపబడవలెను. దానికి మినహాయింపు లేమీ లేవు.

విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము, పాటలు, ప్రార్థన, వాక్యము, ప్రభురాత్రి భోజనము, కానుకలు ఇవన్నియు తండ్రి చిత్తప్రకారమే జరగాలి. ప్రభురాత్రి భోజనము యొక్క అవసరమేమిటని, ప్రతి ఆదివారరం ఈ ఆజ్ఞను పాటించనవసరము లేదని చెప్పకూడదు. "దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను. మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి 12 : 13). బాప్తిస్మము ఏ ప్రయోజనము నిమిత్తము యివ్వబడినదో గ్రహించవలసి యున్నది.

తండ్రి చిత్తప్రకారము జరిగింపకపోయినట్లయితే మనము పరిశుద్ధులము, నిర్దోషులము కాలేము. తండ్రి చిత్తానికి మానవ తలంపులను, తత్వజ్ఞానాన్ని కలుపకూడదు. తండ్రి చిత్తమునకు విధేయులగుట భారమని మానవుడు తలంచినను, విధేయులైనవారికి శ్రేష్టమైన బహుమానాలను, నిత్యజీవాన్ని దేవుడు వాగ్దానము చేసెను.

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

—o—

## వివిధ కోణములలో బాప్తిస్మము

### ( The many sides of Baptism )

బాప్తిస్మము అనగా సంఘములో చేర్చబడుటకు ఒక ప్రధాన క్రియ అని మాత్రమే కొందరి అభిప్రాయము. మరికొందరయితే

బాప్తిస్మము "పాపక్షమాపణ నిమిత్తమని" తలంచుచున్నారు. సత్యమేదనగా బాప్తిస్మము విశాలమైన భావము ద్వివిధము ఆశీర్వాదము లతో కూడికొని యున్నది. బాప్తిస్మము చక్కగా చెక్కబడి సాన పెట్టబడినలువంటి బహు ముఖములతో ప్రకాశిస్తున్న ఒక వజ్రమును పోలియున్నది.

## 1. బాప్తిస్మము పుట్టుక వంటిది

క్రీస్తు యిట్లు చెప్పెను—"ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపడు" (యోహాను 3 : 5). ఈ పుట్టుక ఒక క్రొత్త బంధుత్వానికి నాంది. ఏలయనగా ఒక బిడ్డ తన తల్లి ద్వారా ఈ ప్రపంచపు వెలుగులోనికి ఎట్లు వచ్చునో అదే రీతిగా విధేయుడైన విశ్వాసి నీళ్ళలో బాప్తిస్మము పొందుటద్వారా క్రీస్తుయొక్క శిశువుగా మారును; అనగా క్రైస్తవునిగా మారును (1 పేతురు 2 : 2). అప్పటినుంచి అతని క్రైస్తవ జీవితము ప్రారంభమగును. ఈ రకమయిన నూతన జన్మ అతని క్రీస్తు రాజ్యములోనికి ప్రవేశపెట్టును (మత్తయి 16:18, 19). ఉదాహరణకు ఒకడు మన దేశంలో భారతీయ పౌరునిగా ఏలాగు పుట్టునో అదే విధముగ క్రీస్తు రాజ్య పౌరునిగ పుట్టును. నీళ్ళలోనికి వెళ్ళి బయటకు వచ్చుటను గూర్చిన మాదిరి మాత్రమే నూతన జన్మ విషయములో బైబిలు బోధించుచున్నది (అ. కార్య. 8:36-39). నీళ్ళను చిలుకరించుటగాని, పోత పోయుటగాని, బాప్తిస్మము అనిపించు కోదు. అట్లయిన నీళ్ళు మనకు తల్లి కాదు. పరిశుద్ధాత్మ ఒక మోహిని కన్య వంటిది కాదుగాని, తల్లి గర్భమునుండి శిశువు ఎట్లు జన్మించునో అదే విధముగ నీళ్ళనుండి బాప్తిస్మముద్వారా తిరిగి జన్మించి దేవుని రాజ్యములోనికి వచ్చుట అని స్పష్టమగుచున్నది.

## 2. బాప్తిస్మము—ఒకడు సమాధి చేయబడి తిరిగి లేచుటతో సమానము :-

పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో ఈ విధముగ వ్రాసెను—పాపి పాపము విషయములో చనిపోయి బాప్తిస్మము ద్వారా నీళ్ళలో సమాధి చేయబడి క్రీస్తులోనికి నూతన స్వభావము ధరించుకొనినవాడై తిరిగి లేపబడును (రోమా 6 : 1-4). గనుక మార్పు అనగా బాప్తిస్మముద్వారా నూతన జన్మ పొందుట అనునది ప్రభుని మరణ సమాధి పునరుత్థానములకు సమరూపమైయున్నది. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వారందరు ఆయన సమాధి పునరుత్థానములను చేసి చూపించుటద్వారా ఆయన యందలి విశ్వాసమును నిరూపించుకొనుచున్నారని చెప్పవచ్చును. ఇట్లు చేయుటవలన సిలువ వేయబడిన క్రీస్తును తద్వారా పాపక్షమాపణ విధానమును నిరీక్షణను ప్రపంచమునకు చాటి చెప్పుటయే. రక్షణకు మూలమయిన బాప్తిస్మమును మరణ సమాధి పునరుత్థానములతో పోల్చి అనగా అలంకార రూపకముగా తెలియపరచబడుటను మనము చూచితిమి. ఈ మాదిరికి మరి యే యితర అలంకార రూపకమును చేర్చుటగాని తీసివేయుటగాని చేయకూడదు. క్రీస్తు యోహాను సువార్త 3వ అధ్యాయములో చెప్పిన దానికి, అపొస్తలుడు పౌలు రోమా పత్రికలో వ్రాసిన 6వ అధ్యాయములోని క్రొత్త జన్మకు సంబంధించిన బాప్తిస్మ రూపమునకు మరి యేదియు చేర్చి పరిశుద్ధాత్మను కలవర పెట్టకూడదు.

## 3. బాప్తిస్మము—పెండ్లికై పరిశుభ్రంగా శుద్ధి చేయబడి సిద్ధపరచబడిన పెండ్లికుమార్తెను పోలియున్నది :—

పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 5వ అధ్యాయములో క్రీస్తునకును ఆయన సంఘమునకును గల ప్రేమపూర్వకమైన సంబంధ

మును పెండ్లికుమారుడు పెండ్లికుమార్తెకును మధ్య ఉన్న సంబంధముగా అలంకారరూపకముగా చెప్పుట జరిగెను. "అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి యేదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను, మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసి 5:25-27). ఇప్పటికిని మరి ముఖ్యముగా పురాతన కాలములో పెండ్లికుమార్తెను శుభ్రపరచి పరిశుద్ధంగా భర్తముందు నిలువబెట్టుటను ఒక ముఖ్యమయిన ఆచారంగా భావించెడివారు. "ఆరు మాసములు గోపరస తైలముతోను, ఆరు మాసములు సుగంధ వర్ణములతోను, స్త్రీల పరిమళ క్రియల కొరకైన మరి వేరు పదార్థములతోను స్త్రీలు పరిమళ క్రియలు ముగించి రాజునొద్దకు పోవువారు" (ఎస్తేరు 2 : 12). కావున ప్రతివారు క్రీస్తు భార్యగా అనగా ఆయన సంఘము (భార్య)లో చేర్చబడాలంటే బాప్తిస్మము ద్వారా నీళ్ళచేత వాక్యముతో పవిత్రపరచబడాలి. బాప్తిస్మ మనగా నీటిద్వారా శుద్ధిచేయబడుట. దీనికి వ్యతిరేకముగ నీళ్ళయొక్క ఉపయోగమును సువార్త ఏ విధముగను బోధించుటలేదు.

## 4. బాప్తిస్మము సున్నతియను ఒక వైదిక క్రియను పోలియున్నది:-

అబ్రాహాము కాలమునాటి నిబంధనను బట్టి సున్నతి పొందకుండ ఏ పురుషుడును పరిశుద్ధ రాజ్యములో చేర్చబడెడివాడు కాడు. ఎనిమిది దినముల వయస్సు గలవాడు గోప్యాంగ చర్మమున సున్నతి పొందినచో అతడు దేవునికి ఆత్మీయ కుమారునిగా గుర్తింపబడును (ఆది 17 : 9-14). ఇప్పుడయితే స్త్రీ పురుష భేదము లేకుండ ప్రతి

వారును దేవుని పిల్లలని పిలువబడుటకు హృదయములో సున్నతిని పొందవలెను. పౌలు యిట్లు వివరించెను. "మీరును క్రీస్తు సున్నతి యందు, శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి ఆయన యందు చేతులతో చేయబడని సున్నతిని పొందితిరి. మీరు బాప్తిస్మ మందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి (కొలస్స 2 : 11, 12). బాప్తిస్మముకూడ ఒక విధమ యిన సున్నతి లాంటిది; ఎందుకనగా దేవుడు మన పాపములను మన హృదయమునుండి కోసి లేక త్రుంచివేయును. దేవుడు ఆత్మీయమైన శస్త్రచికిత్సవంటి బాప్తిస్మముద్వారా మన పాపములను తీసివేయును.

## 5. బాప్తిస్మము యూదుల శుద్ధికరణాచారమును పోలియున్నది:-

మోషే ధర్మశాస్త్రము క్రిందనున్న వారు చాల క్లిష్టమైన సమస్యలను ఎదుర్కొనెడివారు. ఏవరైనను శవమును ముట్టుకొనిన యెడల; గాయములతో స్రావము కలిగియున్న, చర్మవ్యాధులు కలిగి యున్న లేక మరే యితర అపరిశుభ్రత కలిగియున్నను అట్టివారిని ఆరాధనకు సంబంధించిన సమాజములోనికి ప్రవేశించుటకు అనర్హుల నుగా నిర్ణయించెడివారు. అటువంటి అపవిత్రులకు ఒక విధమయిన వైదిక క్రియతో కూడిన శుద్ధీకరణను రక్తార్పణతో కలిపి వారి శరీర మును నీళ్ళతో కడిగి పవిత్రపరతురు (లేవి 15 : 13-15). ఇప్పుడయితే అపవిత్రుడయిన పాపి దేవుని గొప్ప యాజకుడయిన క్రీస్తు యొద్దకు వచ్చి "మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములు గలవారమును, నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారమునై యుండి, విశ్వాస విషయములో

సంపూర్ణ నిశ్చయత కలిగి, యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము" (హెబ్రీ 10 : 19-22). ఖచ్చితముగా ఈ పద్ధతి క్రైస్తవ బాప్తిస్మమునుగూర్చి తెలుపుచు, క్రొత్త నిబంధనయొక్క రక్షణ నీళ్ళవలన అనగా నీళ్ళలో బాప్తిస్మము యిచ్చుట ద్వారానే కలుగునని స్పష్టపరచుచున్నది. మరియు పేతురు—"మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్ళకు ఆటంకము చేయగలడా" అని చెప్పెను అ.కార్య. 10 : 47). మనము బాప్తిస్మము వలన నీళ్లలో కడుగబడి దేవుని విషయములో నిర్మలమైన మనస్సాక్షిని పొందుచున్నాము. "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేమనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3 : 21).

## 6. బాప్తిస్మము అనగా చనిపోయిన వారిని బ్రతికించుట:-

పాపి తన అపరాధములను బట్టి, పాపములను బట్టి చనిపోయెను (ఎఫెసీ 2:1); వాటివలననే మనిషి దేవునికి దూరమాయెను (యెషయా 59 : 1, 2). దేవుడొక్కడే పాపము విషయములో చనిపోయిన వారికి నూతన జీవము నివ్వగలడు. అయినను "మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానముద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను" (తీతు 3 : 5). పునర్జన్మ అనగా చనిపోయి తిరిగి బ్రతుకుట. నూతన స్వభావమును కలుగజేయుట అయినను యిదే అర్థమును స్ఫురింపజేయును. అయితే బాప్తిస్మము ద్వారా మన పాపములను కడిగివేసు

కొందము (అ.కార్య. 22 : 16). మనము నీళ్ళలో బాప్తిస్మము పొందినపుడు మనము పరిశుద్ధాత్మ అను వరము పొందుదుము (అ.కార్య. 2 : 38). గనుక పాపము విషయము చనిపోయిన తరువాత దేవుని వలన బాప్తిస్మము ద్వారా మరల జీవించగలుగుచున్నాము.

## 7. బాప్తిస్మము క్రీస్తు సంఘములోనికి ప్రవేశానికి ఆరంభమై యున్నది :-

"మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథి 12:13). ఆ ఒక్క శరీరము క్రీస్తు సంఘమే (కొలస్స 1:18). నీళ్ళలోనికి బాప్తిస్మము పొందుటతోనే ఒకే సత్య సంఘములోనికి చేర్చబడుదురు; అదే సమయాన పాపములు కూడ క్షమించబడును. అదే "ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము చేర్చుచుండెను" (అ.కార్య. 2 : 47).

## 8. బాప్తిస్మము అనగా క్రీస్తులో లేక కీస్తుతో ఐక్యమగుట :

అట్లు చెప్పుటలో ఒకడు క్రీస్తులోనికి చేర్చబడుటను తెలుపుచున్నది. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరును క్రీస్తును ధరించుకొనియున్నారు" (గలతి 3:27). అంతేకాక, "ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగల వారమైనయెడల, ఆయన పునరుత్థానముయొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము" (రోమా 6 : 5). ఈ సందర్భాను సారమైన ఐక్యత బాప్తిస్మమును తెలియపరచుచున్నది.

## 9. బాప్తిస్మము నోవహు కాలమునాటి జలప్రళయమును పోలియున్నది :-

ఆ జలప్రళయము నీతిమంతులను అపరాధులను వేరుపరచెను.

అది పాపాత్ములను భూమిపై నాశనము చేసెను మరియు సురక్షిత ప్రదేశమునకు ఓడను చేర్చెను. "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3 : 21). ఈ నీళ్ళ బాప్తిస్మము పాపులను రక్షింపబడిన వారిని వేరుచేయుటకు నిర్దేశింపబడిన ఒక గీతవలె నున్నది. రక్షింపబడిన వారందరును బాప్తిస్మమును అనుభవించిరి. అట్లు కానివారు యింకను వారి పాపములలోనే యుండిరి.

ఇన్ని కోణాలలో బాప్తిస్మము ఎంతో మనోహరముగా స్పష్టముగా కనబడుచున్నది. దేవుని ప్రేమించిన ప్రతి ఆత్మ దేవుడిచ్చు ఆజ్ఞకు ఎంత తొందరగా లోబడితే అంత శ్రేష్టము. అదేమనగా "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16 : 16). ఇంత ప్రాముఖ్యత గలిగిన బాప్తిస్మమును అందరును పొందవలెనని ఆకాంక్షిస్తున్నాము.

—జాన్ వాడ్.

—o—

## పరిశుద్ధాత్మ అను వరము

క్రొత్తనిబంధనలో ప్రవేశించిన వారికి వాగ్దానము చేయబడిన ఆత్మ "పరిశుద్ధాత్మ అను వరము". అంటే క్రొత్తనిబంధన సంబంధులకు యిది వాగ్దానం చేయబడింది. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన పేతురు, క్రొత్తనిబంధనకు ప్రారంభోత్సవం చేస్తున్న సందర్భంలో, సువార్తను ప్రకటించు చున్నప్పుడు, అతని శ్రోతలు హృదయంలో నొచ్చుకొని, తమ పాపానికి పరిష్కార మార్గాన్ని అడిగారు. అందుకు పేతురు "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు. ఈ వాగ్దానము

మీకును మీ పిల్లలకును దూరస్థు లందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తనయొద్దకు పిలిచిన వారి కందరికిని చెందునని వారితో చెప్పాడు. (అపొ.కా. 2 : 37-39).

క్రొత్తనిబంధనలో ప్రవేశించడానికి ఏ షరతులో, పరిశుద్ధాత్మ అను వరమును పొందుటకు కూడా అవే షరతులు! ఇంతకు ముందు చెప్పాను. ఇది ప్రాముఖ్యమయ్యింది గనుక మరలా చెప్పుతున్నాను. క్రొత్తనిబంధనలో ప్రవేశించడానికైనా, పరిశుద్ధాత్మ అనే వరం పొందడానికైనా ప్రతి ఒక్కడు ప్రభువైన యేసునందు విశ్వాస ముంచి, మూర్ఖులగు ఈ తరమువారికి వేరై, యేసు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు అని ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి. ఈ వర్తమాన మంతా ఒకే స్థలంలో కన్పించకపోయినా, లేఖన సారాంశం అక్కడికి వచ్చి చేరుతుంది.

దాని సంతటిని పౌలు సంక్షిప్తంగా యిలా అన్నాడు: "మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మ చేత ముద్రింపబడితిరి" (ఎఫెసీ 1 : 13). ముద్ర సొంతగానిని (ownership) గమ్యాన్ని (distination) సూచిస్తుంది. దేవుని ఆత్మ చేత ముద్రింప బడినవాడు దేవునికి సొంతమని; వాని గమ్యం దేవుని యింటికి చేరడ మని ఆ ముద్ర సూచిస్తుంది. "ఆయన (దేవుడు) మనకు ముద్రవేసి, మన హృదయములలో మనకు ఆత్మ అను సంచకరువును అనుగ్రహించి యున్నాడు" (2 కొరింథీ 1 : 22).

పరిశుద్ధాత్మ అను వరము క్రైస్తవునిలో సజీవంగా నిలిచి యున్నందున మానవదేహము సయితం దేవునికొరకు ప్రతిష్ఠింపబడి నదై యుంటుంది. అందుకే "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీ

ెరుగరా? మీరు మీ సొత్తుకారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతోనే దేవుని మహిమపరచుడి" అని క్రైస్తవులు హెచ్చరింపబడ్డారు (1 కొరింధి 6 : 19-20).

క్రైస్తవునిలో నివసించు పరిశుద్ధాత్మ అను వరము మన విమోచనకు దేవుని సంచకరువుగా ఉన్నాడు. "సంచకరువు" అంటే advance **payment on any thing bought enjoined with a promise that it will be fully paid while taking home!** వస్తువు కొనుగోలు సమయంలో కొంత సొమ్ము ముందుగా యిచ్చి, తన దనిపించుకొని, తరువాత వచ్చి పూర్తిగా చెల్లించెదననే వాగ్దానాన్ని ఈ సంచకరువు సూచిస్తుంది. "దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు" (ఎఫెసీ 1:14).

అంటే ఈ ఆత్మ మనలో నివసించినంతకాలం, దేవుని సముఖములో మనకు స్వాస్థ్యముంటే; మన దేహములకు కూడా విమోచనం కలుగుతుంది అనే గ్యారంటీ (gaurantee) వుందన్న మాట! అందుకే-"దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచన దినము వరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారని" ఎఫెసీయులు జ్ఞాపకం చేయబడ్డారు (ఎఫెసీ 4:30).

దీనిని బట్టి దేవుని పిల్లలు బహు ధైర్యముగలవారై, ఏ పరిస్థితిని ఎదుర్కొనవలసి వచ్చినా వెనుకాడకుండునట్లు బలపరచబడ్డారు. దానిని బట్టి కొరింథులోనున్న పరిశుద్ధులకు వ్రాస్తూ పౌలు యిలా అన్నాడు: భూమిమీద మన యీ నివాసము (అంటే మానవ దేహము) శిథిలమైపోయినను, చేతిపని కాక దేవునిచేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందున్నదని యెరుగుదుము. మనము

దిగంబరులము కాక వస్త్రము ధరించుకొనిన వారముగా కనబడుదుము (అంటే మహిమ దేహములు పొందుదుము). కాబట్టి పరలోకము నుండి వచ్చు మన నివాసము దీనిపై ధరించుకొన నపేక్షించుచు దీనిలో (ఈ దేహములో) మూల్గుచున్నాము. ఈ గుడారములో (ఈ శరీరములో) నున్న మనము భారము మోసికొని మూల్గుచున్నాము. ఇది తీసివేయబడవలెనని కాదుగాని మర్త్యమైనది జీవముచేత మ్రింగివేయబడునట్లు, ఆ నివాసమును (మహిమ దేహమును) దీనిపై (ఈ దేహముపై) ధరించుకొనగోరుచున్నాము. దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే; మరియు ఆయన తన ఆత్మ అను సంచకరువును మన కనుగ్రహించియున్నాడు" (2 కొరి 5:1-5).

"దేవుని ఆత్మ మీలో నివసించియున్న యెడల మీరు ఆత్మ స్వభావముగలవారే గాని శరీర స్వభావముగలవారు కారు" (రోమా 8 : 9). ఈ ఆత్మ నీలోవున్నాడనే రుజువుకు గంటలువేయ పనిలేదు; లేక రాని భాషలు వచ్చినట్లు నాటకం ఆడ పనిలేదు. ప్రకృతి సంబంధులు ఆత్మలేనివారు (యూదా 19). గనుక ఆత్మ స్వభావము గలవారమై, విమోచనా దినము వరకు ముద్రింపబడిన పరిశుద్ధాత్మ వరమును భయభక్తులతో కాపాడుకొంటూ వుందాం.

—G. దేవదానం, మద్రాసు-12.

—o—

## నీకు సొంతదంటూ ఏమీ లేదని నీకు తెలుసా ?

## (Do you know ?…You Don't Own Anything)

ఇంతకుముందు చెప్పబడిన హానిని బట్టి, ఐశ్వర్యము కలిగి యుండుట చాల విషయములలో అంత ప్రయోజనకరముగా కనబడి

యుంచలేదు, పైగా బహు చెడ్డదిగా చెప్పబడెను. అసలు నీకు తెలుసో లేదో నీకు నీ సొంతదంటూ ఏమీా లేదని బైబిలు చెప్పుచున్నది. లేఖనములనుంచి కొన్ని భాగములను పరిశీలించుదము.

1. "ఆకాశము నీదే భూమి నీదే లోకమును దాని పరిపూర్ణతను నీవే స్థాపించితివి" (కీర్తనలు 89 : 11). సమస్తమును ఆకాశము, భూమి అందున్న వన్నియు దేవునివే అని చాల స్పష్టముగా తెలియజేయబడెను, కదా ? దీనినే మనము క్రొత్తనిబంధన భాగములోకూడ చదువగలము. "భూమియు దాని పరిపూర్ణతయు ప్రభునివై యున్నవి" (1 కొరింథి 10 : 26).

2. ద్వితీయోపదేశ కాండము 8 : 17, 18లో—"అయితే మా స్వాస్థ్యము మా బాహుబలము ఇంత భాగ్యము మాకు కలుగజేసెనని అనుకొందురేమో ! కాగా దేవుడైన యెహోవాను జ్ఞాపకము చేసికొనవలయును. ఏలయనగా తాను మీా పితరులతో ప్రమాణము చేసినట్లు తన నిబంధనను నేటివలె స్థాపింపవలెనని మీాకు భాగ్యము సంపాదించుకొనుటకై మీాకు స్వాస్థ్యము కలుగజేయువాడు ఆయనే".

ఇది కూడ స్పష్టముగా నున్నది. అదేమనగా నీవు ఏమి సంపాదించినను, ఏది కలిగియున్నను అవంతయు దేవుడు నీవు సంపాదించుకొనుటకు శక్తిని, అవకాశమును యిచ్చెనని తెలిసికొనవలెను. కాబట్టి సమస్తము దేవుని మూలముగనే కలిగియున్నదని గ్రహింపవలెను. కాబట్టి మనకు కలిగిన వాటిలో భగవంతునికి భాగమున్నదని తెలుసుకొనవలెను.

3. మత్తయి సువార్త 25 : 14-28లో దేవుడు మనకిచ్చిన వాటిని మనము సవ్యముగా ఉపయోగించాలని, అభివృద్ధి పరచాలని కోరుచున్నాడు. అలా చేయని వానిని సోమరియని, చెడ్డ దాసుడని పిలుస్తు

న్నాడు (26వ వచనము). కావున మన యజమాని (దేవుడు) మన కిచ్చిన భాగమును సవ్యముగా ప్రయోజనకరంగా వినియోగించాలి.

మనము ఆశీర్వదింపబడి యివ్వబడిన తలాంతులను, ఐశ్వర్యమును తెలివిగా ఉపయోగించాలని దేవుడు కోరుచున్నాడు. ఎందుచేతనంటే అవి నిజానికి మనవి కావు. దేవుడు మరలా వాటి లెక్కలు వివరాలు మనలను అడగవచ్చు.

4. 1 తిమోతి 6 : 17 నందు పరిశుద్ధాత్ముడు మంచి వర్తమానమును యిచ్చెను. "ఇహమందు ధనవంతులైనవారు గర్విష్ఠులుకాక, అస్థిరమైన ధనమునందు నమ్మిక యుంచక, సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవునియందే నమ్మిక యుంచుడని ఆజ్ఞాపించుము". కాబట్టి నమ్మది కలిగియుండుము. నీ దృష్టిలో నీకున్న వాటిని అనుభవిస్తూ సుఖముగా నుండుట మాత్రమే కాదని పై వచనము మొదటి భాగము చెప్పుచున్నది. అంతేకాక వాటియందు నమ్మిక ఉంచక ఎల్లప్పుడు దేవునియందే నమ్మిక యుంచవలెనని బోధించుచున్నది.

5. ఇది చాల ఆసక్తి కల్గిన వచనము. యోబు 9:12—ఇక్కడ యోబు తనకున్న దంతయు పోగొట్టుకొనెను. అప్పుడతడు దేవుని గూర్చి ఇట్లనుచున్నాడు. "ఆయన పట్టుకొనిపోగా ఆయనను అడ్డగింపగల వాడెవడు ?—నీవేమి చేయుచున్నావని ఆయనను అడుగతగినవాడెవడు ?" కాబట్టి దేవుడు యివ్వగలడు; నీవద్దనుండి అవి తీసికొని పోవుట మంచిదనిపిస్తే ఆయన తీసికొని పోగలడు.

అయితే యిపుడు నీవు ఏమిచేయాలి ? నీవు ఈ పాఠములన్ని నేర్చుకొని దేవునికి విధేయుడగుట అనగా లోబడి యుండుటను నేర్చుకోవాలి. అవునా ? నీకున్న ఆస్తిని బట్టి; మంచి మంచి వస్తువులను బట్టి

అసలు అవి ఎక్కడనుండి వచ్చాయో, ఎవరి ఆశీర్వాదము వలన సంపాదించుకోగలిగావో, అవి అసలు ఎవరికి చెందునో అనే విషయములు నీవు ఆలోచించుట మరచిపోయి యుండవచ్చును. కాబట్టి ఈ యౌవనకాల తొలిదశనుండే నీకున్న వాటినుండి దేవుని వంతును ఇచ్చుట అను మంచి వైఖరిని అలవాటు చేసుకొనుట ఎంతయినా మంచిది.

"నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" (1 కొరింథి 16 : 2). అనగా ఈ వచనముయొక్క మరొక భావము నీకున్నదానిలో కొంత దేవుని పని నిమిత్తము యిచ్చి మిగతా భాగము నీ యిష్టమొచ్చిన రీతిగా ఖర్చు చేయమని కాదుసుమా! నీకున్న ప్రతీది దేవుని మహిమ ఘనతకు తగ్గట్టు వినియోగించుకొన వలయును.

—మేరీ ఎస్ డేవిస్.

—:o:—

## జ్ఞానోపదేశము
## (Message of Wisdom)

"పేదరికమునైనను, ఐశ్వర్యమునైనను నాకు దయచేయకుము. ఎక్కువైన యెడల నేను కడుపు నిండినవాడనై నిన్ను విసర్జించి—యెహోవా యెవడని అందునేమో లేక బీదనై దొంగిలి నా దేవుని నామమును దూషింతునేమో" (సామెతలు 30 : 8-9). ఈ మాటలు పలికినది ఒక గొప్ప జ్ఞాని. "సొలొమోను చేసిన ఈ మనవి ప్రభువునకు అనుకూలమాయెను గనుక దేవుడతనికి ఈలాగు సెలవిచ్చెను - దీర్ఘాయువునైనను ఐశ్వర్యమునైనను నీ శత్రువుల ప్రాణమునైనను

అడుగక, న్యాయములను గ్రహించుటకు వివేకము అనుగ్రహింపుమని నీవు అడిగితివి. నీవు ఈలాగు అడిగినందున నీ మనవి ఆలకించు చున్నాను. బుద్ధి వివేకములు గల హృదయము నీకిచ్చుచున్నాను. పూర్వీకులలో నీవంటివాడు ఒకడును లేడు ఇక మీదట నీవంటివా డొకడును ఉండడు. మరియు నీవు ఐశ్వర్యమును, ఘనతను ఇమ్మని అడుగకపోయినను నేను వాటినికూడ నీకిచ్చుచున్నాను" (1 రాజులు 3:10-13). "దేవుడు జ్ఞానమును, బుద్ధిని వర్ణింప శక్యముకాని వివేచన గల మనస్సును సొలొమోనుకు దయచేసెను గనుక సొలొమోనునకు కలిగిన జ్ఞానము తూర్పు దేశస్థుల జ్ఞానముకంటెను ఐగుప్తీయుల జ్ఞాన మంతటికంటెను అధికమై యుండెను" (1 రాజులు 4:29-30).

దేవుడు ఈయనకు జ్ఞానమును బుద్ధిని వర్ణింపశక్యముగాని వివేచన గల మనస్సు నిచ్చెను గదా! మానవులకు ఈ జ్ఞాని ఇచ్చిన సందేశ మేమిటని ఆలోచిస్తే తను వ్రాసిన వ్రాతలలో తన జ్ఞానము చేత అనేక విషయములను మానవాళికి తెలియజేసెను. మానవ జీవిత సారాంశమును మానవుల బాధ్యతను తన పుస్తకాలలో చక్కగా తెలియజేసెను. సామెతలు నిజంగా ఆణిముత్యాలు. ఏ పండి తుడూ, మేధావి, ఎప్పుడూ చెప్పనివి, చెప్పలేనివి. ప్రసంగి గ్రంథం ఈయన ప్రారంభించిన విధం జాగ్రత్తగా పరిశీలిస్తే తాను చెప్ప బోయే ముగింపుతో ప్రారంభించి మానవుడు ఏమిచేయవలెనో అతని బాధ్యత ఏమిటో మన ముందు స్పష్టం చేసాడు. ఈ గ్రంథం ప్రారం భము వివరణ, ముగింపు ఈ గ్రంథాన్ని జాగ్రత్తగా పఠించినవారికి ఆత్మీయానందాన్ని యిస్తుందని చెప్పడం అతిశయోక్తి కాదు.

"సూర్యుడుదయించును, సూర్యుడు అస్తమించును తానుద యించు స్థలము మరల చేరుటకు త్వరపడును. గాలి దక్షిణమునకు

పోయి ఉత్తరమునకు తిరుగును. ఇట్లు మరల మరల తిరుగుచు తన సంచార మార్గమున తిరిగి వచ్చును. నదులన్నియు సముద్రములో పడును, అయితే సముద్రము నిండుటలేదు; నదులు ఎక్కడనుండి పారివచ్చునో అక్కడకే అవి ఎప్పుడూ మరలిపోవును"(ప్రసంగి 1:5-7). ఎక్కడ బయలుదేరినప్పటికిని తాను బయలుదేరిన స్థలమును తిరిగి చేరుటకు సూర్యుడు, గాలి, నదులు ఎట్లు త్వరపడుచున్నవో అలాగే నేలమంటిలోనుండి తీయబడిన మానవుడు మంటికి చేరుటకు త్వరపడు చున్నాడని తన గ్రంధములో తెలియజేసెను.

"మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ తాను దయచేసిన దేవునియొద్దకు మరలి పోవును" ప్రసంగి 12 : 7. మానవుడు బ్రతికియున్న దినాలలో అతని ప్రయాస అంతయు వ్యర్థమే అను సత్యాన్ని తెలియజేస్తూ ఒక సూటి ప్రశ్న వేస్తున్నాడు. దీనికి మనం సమాధానం ఆలోచిందాం. "సూర్యునిక్రింద నరులు పడు చుండు పాటు అంతటివలన వారికి కలుగుచున్న లాభమేమి?" (ప్రసంగి 1 : 3).

ఆయన జీవితం గురించి ఈలాగున తెలియజేసెను. "సూర్యుని క్రింద నేను ప్రయాసపడి చేసిన పనులన్నిటిని నా తరువాత వచ్చు వానికి నేను విడిచిపెట్టవలెనని తెలిసికొని నేను వాటియందు అసహ్య పడితిని" (2:18). "మరియు ప్రతివాడు అన్నపానములు పుచ్చుకొనుచు తన కష్టార్జితము వలన సుఖమనుభవించుట దేవుడిచ్చు బహుమానమే అని తెలిసికొంటిని. దేవుడుచేయు పనులన్నియు శాశ్వతములని నేను తెలిసికొంటిని. దాని కేదియు చేర్చబడదు, దానినుండి ఏదియు తీయ బడదు. మనుష్యులు తనయందు భయభక్తులు కలిగియుండునట్లు దేవు డిట్టి నియమము చేసియున్నాడు" (3 : 13-14). ఈ వచన భాగమును

బట్టి మానవ జీవితంలో మానవునికి ప్రయోజనకరమైనది. దేవుని యందు భయభక్తులు కలిగియుండుటయే అని గ్రహించగలుగుచున్నాము. "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుటయే జ్ఞానమునకు మూలము" (సామె 9 : 10).

ప్రసంగి గ్రంథంలో యిదే ముగింపును సొలొమోను వ్రాసెను. ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే. "దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను. మానవకోటికి ఇదియే విధి" (12:13). మానవుని విధి లేక బాధ్యత ఏమిటో తెలియజేసి తరువాత వచనములో ఎందుకు మానవులు దేవునియందు భయభక్తులు కలిగియుండాలి ? అనే ప్రశ్నకు జవాబు చెప్పుచున్నాడు. "గూఢమైన ప్రతి అంశమును గూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతి క్రియను అది మంచిదేగాని చెడ్డదేగాని, తీర్పులోనికి తెచ్చును" (12 : 14). మానవునికి తీర్పు తీర్చబడే దినమొకటున్నదని అందుచేత మానవులందరు దేవునియందు భయభక్తులు కలిగియుండవలెనని తన గ్రంథాన్ని సొలొమోను ముగించెను. ఎప్పుడు మానవుడు తన సృష్టికర్తను జ్ఞాపకము చేసికొనవలసియున్నది ? "దుర్దినములు రాకముందే - ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే తేజస్సునకును సూర్య చంద్ర నక్షత్రములకును చీకటి కమ్మకముందే, వాన వెలిసిన తరువాత మేఘములు మరల రాకముందే నీ బాల్య దినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" (ప్రసంగి 12 : 1-2).

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

# దేవుని పిల్లలెవరు ?

## (Who are the Children of God?)

యోహాను స్వాభావిక మార్గము ద్వారా దేవుని కుటుంబములో జన్మించుట అసంభవమని సూచించినాడు. "రక్తము వలననైనను, శరీరేచ్ఛ వలననైనను, మనుష్యేచ్ఛ వలననైనను పుట్టినవారు దేవుని పిల్లలు కారు" (యోహా 1:13). ఈ తలంపును వివరముగా చూతము.

### 1. రక్తము వలన (Not of the Blood)

యూదులు తాము అబ్రాహాము సంతతి గనుక అబ్రహాము రక్తము వారిలో ప్రవహించుచున్నదనియు, అందువలన దేవుని పిల్లలమనియు తలంచిరి. ఇది సత్యము కాదని పై వాక్యము రుజువు చేయుచున్నది.

మానవ బిడ్డ తండ్రి రక్తమును పంచుకొని జన్మించును. ఆత్మీయుల పిల్లలు ఆత్మీయులు కాకపోవచ్చును. అనగా దేవుని పట్ల సంపూర్ణ విశ్వాసమును ప్రదర్శించు వారు కాకపోవచ్చును. అందువలన రక్తము ద్వారా ఒకడు దేవుని బిడ్డ కానేరడని యోహాను చెప్పుచున్నాడు.

### 2. శరీరేచ్ఛ వలన (Not of the will of the Flesh)

మానవుడు భౌతిక వాంఛలకు లోనైనవాడు. ఈ వాంఛలు మానవుని దేవునికి దూరము చేయును. అందువలన దేవుడే మానవుని ఆకర్షింపవలసి యుండును. వానిలో దైవ తలంపు కలిగినపుడు అది పరిశుద్ధాత్మ కార్యమని మనము ఎరుగుదుము. అయితే ప్రకృతి సంబంధియైన మానవుడు సాధారణ పరిస్థితులలో ఆత్మీయ విషయ

ముల నంగీకరించడు. కనుక శరీరేచ్ఛలను గుప్పెటిలో నున్న మానవుడు దేవుని బిడ్డ యగుట అసంభవమని యోహాను చెప్పుచున్నాడు.

### 3. మనుష్యేచ్ఛవలన (Not of the will of Man)

ఇచ్చోట మనుష్యుడు అన్నపుడు మానవజాతికి చెందినవాడని భావముకాదు. అట్లయినచో మూలభాషలో Anthroopou అను పదము వాడబడి యుండును. అయితే యోహాను Andros అను పదమును వాడినాడు. అనగా దాని భావము "పురుషుడు". స్త్రీ పురుషుల సంయోగము వలన బిడ్డ జన్మించినట్లు ఒకడు దేవుని బిడ్డ కానేరడని యోహాను చెప్పుచున్నాడు. అయితే దేవుని పిల్లలెవరు అను ప్రశ్నకు యోహాను సమాధానమిది. "తన్ను ఎందరంగీకరింతురో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను" (యోహాను (1 : 12.)

ఈ వాక్యమును బట్టి మానవులందరు దేవుని పిల్లలనుట సరికాదు. అపొ. పౌలు ఏథెనియలో తత్త్వ శాస్త్రజ్ఞులతో మాట్లాడుచు మనము దేవుని సంతానము అని చెప్పినాడు (అపొ.కా.17:29). అనగా దేవుని ద్వారా కలిగిన వారము లేక దేవుని వారము అను భావము అందుకలదు. అంతియేగాని దేవుని పిల్లలు (Children of God) అనుభావము అందు లేదు. దేవుడు తన వాత్సల్యమును బట్టి ప్రతి వ్యక్తి తన బిడ్డ కావలెనని కోరుచున్నాడు. మానవుడు జన్మ నుండి దేవుని బిడ్డ కాడని గుర్తించవలెను. ఈ లోకములో జన్మ ఎత్తిన మీదట విశ్వాసమూలముగా క్రీస్తును అంగీకరించినపుడు మనము దేవుని పిల్లలమని వాక్యము చెప్పుచున్నది.

Tekna గ్రీకు పదమునకు "పిల్లలు" అని భావము. పిల్లలు అను భావములో పురుష, స్త్రీ లింగములు యిమిడియున్నవి. Tekna

అను పదము Tiktoo అను క్రియనుండి వచ్చినది. Tiktoo అను మాటయొక్క భావము "జన్మించుట". కనుక విశ్వాసముద్వారా ప్రభువుకు విధేయులమైనపుడు మనము నూతనముగా జన్మించిన పిల్లల మగుదుము లేక దేవుని రాజ్యములో పసిబిడ్డలుగా జన్మించుదుము.

ప్రభువైన యేసు దేవుని బిడ్డగా (Child of God) పిలువ బడలేదు. అయితే ఆయన దేవుని కుమారుడు (Son of God) అనియు మనుష్య కుమారుడనియు (Son of Man) పిలువబడినాడు. కారణమేమి? Tiktoo అను క్రియనుండి వచ్చిన Teknon యేసుకు వర్తించదు. ఆయన తండ్రితో సమానుడు. ఆయనతో నిత్య సహవాస ములో నున్నవాడు. ఆయన దేవుడు (యోహా 1 : 1). అందువలన యేసు కుమారుడు (Son) కాని దేవుని బిడ్డ (Child) కాడు. విశ్వా సముద్వారా మనము ప్రభువుని మన హృదయములోనికి ఆహ్వానించి నపుడు మనము దేవుని పిల్లలమగుదుము. అది ప్రభువుద్వారా మనకు కలిగిన అధికారము.

Teknon (Child) అను పదము దైవ ఆప్యాయతను ఆర్ద్ర హృదయతను సూచించును. కనుక ప్రభువును అంగీకరించినపుడు మనము కేవలము నిత్యజీవమునకు వారసులము మాత్రమే కాక దేవుని పిల్లలముగా ఆయన ఆప్యాయతను ఆర్ద్ర హృదయతను అనుభ వింతుము.

## దత్త పుత్రత్వము (Adoption)

ఇది రెండు స్థాయిలలో జరుగును.

1) సిలువ రక్తముచేత విమోచింపబడి మనము దేవుని రాజ్య ములో ప్రవేశించుటకు ఆత్మమూలముగాను నీటిమూలముగాను జన్మించవలెనని ప్రభువు చెప్పినాడు (యోహా 3 : 5).

ఇట్టి జన్మ ద్వారా మనము తండ్రికి దత్తత చేయబడిన పిల్లల మనియు అది ఆత్మ కార్యమనియు అపొ. పౌలు చెప్పుచున్నాడు (రోమా 8 : 15, 16). దత్తత చేయబడిన పిల్లలమైనప్పటికిని, ఆయన మహిమ గల స్వాస్థ్యమునకు వారసులమే కాని దాని ననుభవించుట లేదు.

2) మన జీవితకాల మంతయు దేవుని ఆత్మచే నడిపింపబడి ఈ దేహమునుండి విమోచింపబడి, అనగా పునరుత్థానము నొంది మహిమా శరీరముతో దేవుని నిత్య రాజ్యములో ప్రవేశించునపుడు ఆయన దత్తత తీసుకొనిన కుమారులముగా ఆయన మహిమ గల స్వాస్థ్యమును అనుభవింతుము (రోమా 8 : 14, 23; గలతీ 4: 4-6; ఎఫెసి 1 : 5).

—థామస్ ప్రేమానందము, కాకినాడ.

—o—

## సంక్షిప్త వార్తలు

గత సంవత్సరములో జిల్లా ప్రాంతములో అనేకులకు క్రీస్తు యొక్క ఉపదేశమును, ప్రేమను అందించిన పరిచర్య మరియు ఐక్యత ప్రాంతపు సరిహద్దులు దాటి పశ్చిమగోదావరి, కృష్ణా మరియు విశాఖ పట్టణం జిల్లాలకు విస్తరించెను. ఈ పరిచర్య ఫలించుచు వ్యాపించుచున్నది. ఈ క్రీస్తు సంఘముల సువార్తికుల సమావేశాలు ఆంధ్ర ప్రదేశ్ లోని మిగిలిన అన్ని జిల్లాలకు మరియు యావద్భారత దేశానికి విస్తరించి India Workshop కావాలని ప్రార్థించుదాం.

25వ తేదీన గంటిలో జరిగిన ఫిబ్రవరి నెల సువార్తికుల సమావేశానికి పశ్చిమ గోదావరి జిల్లానుండి అనేకమంది సువార్తికులు వచ్చి పాల్గొనిరి. "Growing Liberalism is a Threat to the Unity of the Church" అను ప్రాముఖ్యమైన అంశము చర్చింప

పడెను. సంఘముయొక్క ప్రాముఖ్యమును, లేఖనముల అధికారమును నిరాకరించే స్వేచ్ఛాజీవుల విషయమై అప్రమత్తముగా ఉండవలెనని హెచ్చరించిరి.

ఉదయం జరిగిన సమావేశము సోదరులు డి. శ్రీరాములుగారి ప్రార్థనతో ప్రారంభమయ్యెను. సోదరులు ఎ. వినయానంద్ గారు (అనకాపల్లి) పై అంశము ననుసరించి భిన్నమైన బోధ సంఘ ఐక్యతకు ప్రమాదమని హెచ్చరించిరి. సోదరులు పాల్ కూటంగారు తీతు 1 : 10-11 వచనాలను వివరించి అంశమును బోధించిరి. మధ్యాహ్నం జరిగిన సమావేశములో బ్రదర్ టి. ప్రసాదరావుగారు (మైలవరం, కృష్ణాజిల్లా) బ్రదర్ జాషువా కూటంగారు, బ్రదర్ ఇ.కె.వి. ప్రసాదరావుగారు స్వేచ్ఛ అధికమగుట సంఘ ఐక్యతకు ప్రమాదమని వివరించిరి. "అట్టివారు ఉపదేశింపకూడని వాటిని దుర్లాభము కొరకు ఉపదేశించు" దురని తెలియజేసిరి. బ్రదర్ వై. ప్రభుదాస్ గారి ప్రార్థనతో సమావేశము ముగిసెను.

సోదరులు సి.హెచ్. జాన్‌బాబుగారు, సోదరులు వి. చిన్నయ్య గారు, సోదరులు యన్. ఏలియాగారు మిగిలిన సోదరులు నాయకత్వం వహించగా గంటి మరియు గంటి, పెదపూడి గ్రామ మంతయు తిరిగి సువార్త దండయాత్ర చేసి, రక్షణా సంకల్పాన్ని వివరించే వందలాది కరపత్రాలను పంచిపెట్టి గ్రామ మంతటికిని సువార్త అందించిరి. 9 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

రాత్రి కూటమునకు సుమారు 400 మంది హాజరై దేవుని వర్తమానమును వినిరి. సోదరులు వినయానంద్ గారు "రక్షణ" అను అంశముపై గొప్ప సువార్త సందేశమును అందించిరి. ఈ వర్తమానము అనేక మంది విద్యావంతులను ఆకర్షించెను.

ఈ సందేశమందు దేవుని శక్తిని కనపరచే అనేక దృష్టాంతములను వినియోగించిరి. బ్రదర్ టి. ప్రసాదరావుగారు "మేము యేసును చూడగోరుచున్నాము" యోహాను 12 : 20-21 అను అంశమును మిక్కిలి గంభీరముగ బోధించిరి. ఈ సందేశము అనేక హృదయములలో ఆనందము కలుగజేసెను.

సోదరులు బెంజిమన్ గూటంగారు మరియు స్థానిక సువార్తికులు యస్. రామకృష్ణారావుగారు కార్యక్రమాలు విజయవంతముగ నిర్వహింపబడునట్లు ఏర్పాట్లు గావించిరి. కూటమునకు హాజరైన సువార్తికులు, వివిధ ప్రజలు సంతోషముతో తమతమ గ్రామములకు తిరిగి వెళ్ళిరి. మార్చి నెల సువార్తికుల సమావేశము ర్యాలి దగ్గర నున్న లక్ష్మీపోలవరం గ్రామములో జరుగును. అందరు ఆహ్వానితులు.

—o—

Regd. No. H/KD—45, KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To